ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 19 | సంచిక : 11 | జూలై 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు
01-06-2014
1995

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-06-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రాముడు మన భారతీయులకు ఆరాధ్యదైవం, సత్యపాలన తెలిసినవాడు, మన జీవితవిధానం ఎలా ఉండాలి అనేది ఆయన మనకు ఆచరించి చూపించాడు. రామాయణం చదివేటప్పుడు రాముడికి శీలమే కేంద్రం అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మనం తరించడానికి ఒక్క రామనామం సరిపోతుంది. మన దుఃఖానికి ఎవరో కారణం అనుకోవటం తప్పు. కోడలుకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే అత్తగారి మీదకు గెంటేస్తుంది. అది కరెక్టుకాదు. మన దుఃఖానికి మనమే కారణం కాని ఎవరో ఇతరులు కారణం కాదు. మనకు ఏదైనా సఫరింగ్ వస్తూ ఉంటే ఆ సఫరింగ్‌కు మనమే కారణం అయి ఉంటాము, దానిని ఇతరుల మీదకు నెట్టేసే అలవాటు మనం వదిలించుకోవాలి.

గురుపౌర్ణమి రోజున ఎవరి గురువులను వారు ఆరాధించుకోమని ఆ గుర్తుకోసం వ్యాసపూర్ణిమను గురుపౌర్ణమిగా మన పెద్దలు ఏర్పాటుచేసారు. అంటే ఆ రోజున గురువుపట్ల మీకు ఉన్న కృతజ్ఞతను తెలియపరచండి అని చెప్పటం. అది మన భారతీయ సాంప్రదాయం. పూర్వపు గురువులు కేవలం చదువు చెప్పటమే కాకుండా స్టూడెంట్ ప్రవర్తన కూడా చూసుకొంటూ ఉండేవారు. అంటే ఉపాధ్యాయుడి బాధ్యతే కాకుండా తండ్రి బాధ్యత కూడా వారు తీసుకొనేవారు. స్టూడెంట్స్ ఎవరైనా అభివృద్ధిలోనికి రాలేకపోతున్నారు అంటే దానికి టీచర్సే కారణం. మీకు సబ్జక్టు అర్థంకావటంలేదు అంటే దానికి మీరు కారణం కాదు, మేమే కారణం. మా బ్రెయిన్‌లోనే స్పష్టత లేనప్పుడు మీకు స్పష్టత తీసుకొని రాలేము. కుదపా సత్యనారాయణగారు అని లెక్కలు మాష్టారు

ఉండేవారు. ఆయన నూటికి అయిదు మార్కులు వచ్చేవాడికి కూడా నూటికి నూరు మార్కులు తీసుకొని రాగలడు. ఎందుచేతనంటే నేను ఈ సబ్జెక్టు బాగా నేర్చుకోవాలి అనే ఆర్తిని ఆ స్టూడెంట్ మనస్సులోనికి తీసుకొని వచ్చేవారు. మంచి టీచర్ దొరకకపోతే అది స్టూడెంట్ యొక్క దురదృష్టం. కొంతమంది టీచింగ్‌లో క్వాలిటీ ఉంటుంది. కొంతమందికి టీచింగ్ లక్షణాలు పుట్టుకతోనే వస్తాయి. అటువంటి టీచర్స్ సబ్జక్టు చెపుతూ ఉంటే అది మీ గుండెకు హత్తుకొంటుంది.

సోమరితనం ఉన్నవారు ఎందులోను అభివృద్ధిలోనికి రాలేరు. భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగా కాని అభివృద్ధిలోనికి రావాలంటే సోమరితనం పనికిరాదు. కృషి, ప్రయత్నం ఉండాలి. ఒకసారి ఫెయిల్ అయినాగాని ఏరంగంలో ఫెయిల్ అయ్యాడో ఆ రంగంలోనే మరల ప్రయత్నం బాగా చేయాలి. ప్రయత్నం లేకుండా ఏదీ సాధ్యం కాదు. ప్రయత్నం చేయండి, ప్రయత్నం అవసరం అనేవారు భగవాన్. మీరు ఏదైనా రంగంలో అభివృద్ధిలోనికి వచ్చారంటే అది మీ ప్రయత్నం వలన వచ్చారుకాని సోమరితనం వలన కాదు. సోమరితనం మనలను అభివృద్ధిలోనికి రానీయదు. సర్వసాధారణంగా మనిషి దృష్టి బాహ్యంగానే ఉంటుంది. మనం ఏమీ ప్రయత్నం చేయలేకపోతే మనస్సు నాచురల్‌గా బాహ్యముఖానికి పోతూఉంటుంది. మనం ప్రయత్నం చేస్తే, సాధన చేస్తే మనస్సు అంతర్ముఖమవుతుంది. మనస్సు అంతర్ముఖమైతే అది ఆత్మజ్ఞాన సముపార్జనకు ఫిట్ అవుతుంది. అంతర్ముఖమైన మనస్సుకు మాత్రమే ఆత్మానుభవం పొందటానికి యోగ్యత కలుగుతుంది. మనస్సు నిర్మలమైతే, మనస్సుకు ఏకాగ్రత వస్తే, మనస్సుకు పవిత్రత వస్తే అప్పడు అది అంతర్ముఖమవుతుంది. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే ఈ శరీరం కాలిబూడిద అవ్వకముందే నిర్వాణసుఖాన్ని ఎవడైతే పొందాడో వాడికి ఇంద్రియాలలో ఉన్న అంటుకాని, మనస్సులో ఉన్న అంటుకానీ తగలదు. పునర్జన్మలను తీసుకొని వచ్చే గుణాలన్ని కాలిపోతాయి. ఈ శవం భూమి మీద తిరుగుతున్నప్పడే పునర్జన్మలను తీసుకొని వచ్చే గుణాలన్నీ ఎప్పడైతే కాలిపోయాయో ఇంక వాడికి ఈ శరీరం పోయేటప్పడు శరీరం పోతోంది కాని నేను చనిపోవటంలేదు, నేను ఉన్నాను, నా అస్థిత్వానికి ఏమీ భంగం లేదు అనేటువంటి అనుభవం వాడికి కలుగుతుంది. అదే అమృతానుభవం. శరీరానికి మృత్యువు ఉంటుందికాని వాడికి మృత్యువు ఉండదు. వాడు నేనుగా ఉండడు తానుగా ఉంటాడు. సాధన చేస్తే మీకు అమృతానుభవం కలుగుతుంది. కొంతమంది ఆ స్థితిని పొందారు. ఆ స్థితిని పొందిన వారికి అపారమైన దయ ఉంటుంది. నిర్వాణసుఖాన్ని పొందినవాడికి ఇంక జన్మలేదు, దుఃఖంలేదు, ద్వేషం లేదు, స్వార్థం లేదు. నిర్వాణసుఖాన్ని ఎవడైతే పొందాడో వాడు ఇతరులను ఆ వైపుకు

తోలుకొని వెళ్ళకుండా ఉండలేడు. వాడు ఏ అలౌకికసుఖాన్ని, ఏ అలౌకికశాంతిని అనుభవిస్తున్నాడో అది అందరూ అనుభవించాలి, వీళ్ళందరూ కూడా పునర్జన్మలేనిస్థితిని పొందాలి అని చూస్తాడు. జననమరణచక్రం నుండి జీవకోటిని బయటకు తీసుకొని రావటానికి వారిలో పునర్జన్మ కారణాలు ఏమైనా ఉంటే వాటిని బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు. మీకు ఎప్పుడైనా సుఖాలు వస్తాయి మరల ముగిసిపోతాయి. అలా కాకుండా ముగింపులేని సుఖం, ముగింపులేని శాంతి మీరు పొందటానికి, ఈ శరీరంతోటి, ప్రపంచంతోటి, దేవుడితోటి సంబంధం లేకుండా ఇండిపెండెంట్ హేపీనెస్‌లోనికి మిమ్మల్ని మేల్కొలపటానికి గురువు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాడు, ఒకవేళ మీరు బద్ధకించినా గురువు వాడు చేసే ప్రయత్నం మానడు, వాడు గురువు. ఇదే రమణమహర్షిగారు ఆయన అనుభవంలో ఏమని చెప్పారు అంటే “పులినోటిలోపడ్డ మాంసపు ముక్కను మనం ఎలా బయటకు తీయలేమో అలాగే గురువు అనుగ్రహంలో పడ్డ భక్తుడు రక్షింపబడతాడు కాని అందులోనుండి తప్పించుకొనే అవకాశం లేదు” అని చెప్పారు. మహాత్ముల యొక్క దయ ఎలా ఉంటుంది అంటే ఒక చేయి రెండో చేతిని తాకుతూ ఉంటే ఫిజికల్‌గా ఆ టచ్ మనకు ఎలా తెలుస్తూ ఉంటుందో ట్రూత్ రీలైజ్డ్ సోల్స్ యొక్క అనుగ్రహం, వారి యొక్క దయ మన మనస్సును తాకుతున్నట్లు అంత స్పష్టంగా మనకు తెలుస్తుంది. నిప్పు మీద చెయ్యిపెడితే కాలుతుంది అని మీకు అనుభవంలోనికి వచ్చాక ఇంక ఎవరూ చెప్పనక్కరలేదు. అలాగే మహాత్ముల దయవలన ఈ కృషి మనం చేయగలుగుతున్నాము అని ఎంతో సాధన చేసిన తరువాత అది మీకు అనుభవంలోనికి వస్తుంది. అది నోటిమాటలతో చెప్పేదికాదు, అది మీకు అనుభవంలోనికి రావాలి, అయితే దీనికి కొంత ఓర్పు ఉండాలి. మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యాలి. ఫలితం కోసం కనిపెట్టుకొని ఉండకూడదు. ఏది ఎప్పుడు ఎక్కడ రావాలో అది అప్పుడు అక్కడ వస్తుంది. చావు కూడా అంతే మనం కంగారుపడితే చావురాదు. అది ఎప్పుడు రావాలో అంతా ఈశ్వరప్రణాళిక ప్రకారం జరుగుతుంది.

ఈ ప్రపంచమే నిజం అని నీ మనస్సు అనుకొంటూ ఉంటే నువ్వు దానిని లోపలకు వెళ్ళమని చెప్పినా అది వెళ్ళదు. అది బయటకు పోవటానికి అలవాటు పడిపోయింది. అందుచేత లోపల ఈశ్వరుడు ఉన్నాడు అని నువ్వు చెప్పినా అది బయటకుపోతుంది కాని లోపలకు వెళ్ళదు. దూడకు పచ్చగడ్డి రుచి చూపిస్తేగాని అది వట్టిగడ్డితినటం మానదు. అలాగే ఈ జీవుడికి లోపల ఉన్న రుచి తెలిస్తే బయట వాండరింగ్ మానేస్తాడు అంటే లోపల ఉన్న రుచి ఈ మనస్సుకు తెలిస్తే అప్పుడు అంతర్ముఖమవుతుంది. ఈ ప్రపంచం బ్రహ్మంగా నిజం కాని ప్రపంచంగా నిజంకాదు, నామరూపాలుగా నిజంకాదు. బయట ఉన్న ప్రపంచం

బ్రహ్మంగా సత్యమే కాని నామరూపాలుగా అసత్యం. ఈ ప్రపంచం అసత్యమని ఎందుకు చెపుతున్నాము అంటే అది సత్యమని చెపితే ఇంక మీ మనస్సు అటే వెళుతుంది కాని దానికి లోచూపు రాదు. బాహ్యముఖమైన మనస్సుకు అది బ్రహ్మం అని తెలియదు. అది బ్రహ్మం అని ఎప్పుడు తెలుస్తుంది అంటే మిమ్మల్ని మీరు చూసుకొని ప్రపంచాన్ని చూస్తే మీరే ఈ ప్రపంచం అంతా వ్యాపించి ఉన్నారని మీకు తెలుస్తుంది. మిమ్మల్ని మీరు చూసుకోకుండా ఈ ప్రపంచాన్ని చూస్తే మీరు వేరు, ఈ ప్రపంచం వేరు అనిపిస్తుంది. మిమ్మల్ని మీరు చూసుకొని ప్రపంచాన్ని కనుక చూస్తే ఈ ప్రపంచరూపంలో ఉన్నది కూడా మీరే అనేటువంటి అనుభవం మీకు వస్తుంది. అప్పుడు మీకు భయం ఉండదు, ద్వేషం ఉండదు. బ్రహ్మపదార్థానికి రూపం ఉండదు, గుణం ఉండదు, వాసన ఉండదు. బ్రహ్మం యొక్క స్వరూపం సత్యం, జ్ఞానం, ఆనందం, అనంతం. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలని అనుకొంటున్నారు కాని అటువైపు ప్రయాణం చేసింది చాలా తక్కువ, చేయవలసింది చాలా ఎక్కువ ఉంది. మన ఉపనిషత్ ఋషులు చెప్పినదానికంటే మన రమణమహర్షి, రామకృష్ణుడు చాలా అందంగా చిన్నచిన్నమాటలతో చెప్పారు. ఉపనిషత్‌లలో సత్యం అంటాడు, జ్ఞానం అంటాడు, ఆనందం అంటాడు, అనంతం అంటాడు. ఎందుకు అంత గొడవ? ఉన్నది ఒక్కటే, అదే సత్యం, సత్యమే జ్ఞానం, సత్యమే అనంతం. అంటే ఉపనిషత్ ఋషులు చెప్పలేదనికాదు రమణుడు, రామకృష్ణుడు వారు చెప్పే విషయాన్ని సూటిగా వడ్డించిన విస్తరిలా చెప్పేవారు. ఉపనిషత్ ఋషులు నాలుగు పేజీలు చెప్పి వారు చెప్పాలనుకొన్నది చివరలో అయిదో పేజీలో చెపుతారు. ఇప్పుడు వీళ్ళు ఏమి చేస్తున్నారు అంటే మనలను అనవసరంగా నాలుగు పేజీలు చదివించరు. వారి చెప్పేది ఏదో ఒకేసారి డైరెక్టుగా మొదటిపేజీలోనే చెప్పేస్తారు. అయితే ఈ మాటలు పెద్దవాళ్ళు ఎవరూ అంగీకరిస్తారని నేను అనుకోవటం లేదు. భగవాన్ చెప్పేది ఎలా ఉంటుంది అంటే డైరెక్టుగా మీ జేబులో పది రూపయలు పెట్టేస్తాడు. పూర్వపు ఋషులు ఏమిటి అంటే ఈ పది రూపాయలతోపాటు ఏదో ఒకటి కలిపిపెడతారు. అప్పుడు మీరు ఏమి చెయ్యాలి ఆ కలిపింది తీసేసి ఈ పది రూపాయలు తీసుకోవాలి అంటే కొంత బయట పడేసేది ఉంటుంది. అందుచేత ఋషులు చెప్పినదానికి వీరికి చాలా తేడా ఉంది.

బ్రహ్మంను ఆరాధించటం మంచిదేకాని అది చాలా కష్టం. దానికి తగిన అర్హత ఉండాలి. జీవుడికి ఫలానా రూపం నాది, ఫలానా పేరు నాది అని రూపబుద్ధి, నామబుద్ధి ఎక్కువగా ఉంటుంది. రూపబుద్ధి, నామబుద్ధి ఎక్కువగా ఉన్నప్పుడు బ్రహ్మంను ఆరాధించడానికి ప్రయత్నం చేసినా మనం బ్రహ్మంను ఆరాధించలేము. అందుచేత రాముడిని కాని, కృష్ణుడినికాని ఏదో ఒక అవతారపురుషుడిని ఆరాధించటం మంచిది. దీనికి

రాజగోపాలాచారి ఏమని చెప్పాడు అంటే “బ్రహ్మంను ఆరాధించటం అంటే నర్సాపురం గోదావరి నదిని ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కకు ఈదుకొని వెళ్ళటం వంటిది. అలా ఈదుకొని వెళ్ళే శక్తి ఉంటే వెళ్ళవచ్చు. కాని అది కష్టమైన పని. అందుచేత రాముడినిగాని, కృష్ణుడినిగాని ఏదో ఒక అవతారపురుషుని ఆరాధించటం ఎటువంటిది అంటే ఒక నావలో కూర్చుని నదిని దాటటం వంటిది. ఈదుకొని వెళ్ళేటప్పుడు ఏమో మధ్యలో మునిగిపోవచ్చు. అవతారపురుషుని ఆరాధించి మీరు బ్రహ్మంను పొందటం అది సేఫ్‌సైడ్” అని చెప్పారు.

చైతన్యం లేకుండా ఏమీ లేదు. చైతన్యం లేకుండా ప్రపంచం లేదు. బయట ప్రపంచం అది ఒక భ్రాంతి, అది నిజం కాదు, నువ్వు నిజంకానిదానిని నిజం అనుకొంటున్నావు. అశాశ్వతాన్ని శాశ్వతం అనుకొంటున్నావు. నిజంకాని ప్రపంచాన్ని చూసి నిజమని భ్రమ పడుతున్నావు. ఉన్న దానినేమో లేదు అనుకొంటున్నావు, లేనిదానిని ఉంది అనుకొంటున్నావు. యిప్పుడు మనం ఏమనుకొంటున్నాము అంటే నేను వేరు, ఈ ప్రపంచం వేరు, దేవుడు వేరు అనుకొంటున్నాము. నువ్వు బ్రాహ్మీస్థితి కనుక పొందితే ఈ మూడు వేరు కాదు, మూడూ ఒక్కటే, ఉన్నది ఒక్కటే అనే అనుభవం నీకు కలుగుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఈ మూడూ కూడా నిజం అని కొంతమంది చెపుతున్నారు, అజ్ఞానం ఉన్నంతసేపు, నువ్వు మాయలో ఉన్నంతసేపు ఈ మూడూ నిజమే. నువ్వు మాయలోనుండి బయటకు వచ్చినప్పుడు, అజ్ఞానంలోనుండి బయటకు వచ్చినప్పుడు మూడులేవు, ఒక్కటే మూడు కింద కనిపిస్తోంది అని నీకు తెలుస్తుంది. అహంకారం ఉన్నవాడికి మూడు కాని, అహంకారం నశించినప్పుడు ఉన్నది ఒక్కటే. ఆ ఒక్కటీ అజ్ఞానికి మూడు కింద కనిపిస్తున్నాయి. వాడు తనను చూసుకొని లోకాన్ని చూస్తే తానే లోకం కింద ఉన్నాను అన్న సంగతి అనుభవం లోనికి వస్తుంది. ఒకటా, రెండా అని ఒక ముస్లిమ్ భగవాన్‌ను అడిగాడు. ఎప్పుడు అన్నారు భగవాన్. ఆ ముస్లిం ఇప్పుడే అన్నాడు. అయితే రెండే అన్నారు భగవాన్. నీకు తెలియకపోతే రెండే, తెలిస్తే ఉన్నది ఒక్కటే. యిప్పుడు నువ్వు జీవుడు అనుకొంటున్నావా, దేవుడు అనుకొంటున్నావా? నేను జీవుడినే అనుకొంటున్నావు కదా అప్పుడు దేవుడిని కూడా అంగీకరించాలి. అంటే నీకు దేహభావన ఉన్నంతసేపు రెండే కరెక్టు. అజ్ఞానదశలో ఉన్నప్పుడు రెండే. నువ్వు రెండు అనుకొన్నప్పుడు కూడా అది ఒక్కటే. కాని నీకు తెలియనితనం వలన ఆ ఒక్కటే రెండు కింద కనిపిస్తోంది. అది తెలుసుకొంటే రెండు ఒకటి కిందే కనిపిస్తుంది. తెలియకపోతే అజ్ఞానం, తెలిస్తే జ్ఞానం.

మనం కాళ్ళకు, చేతులకు పని చెపుతున్నాము కాని మెదడుకు పని చెప్పటం లేదు. మెదడుకు మనం పని చెప్పకపోతే నెమ్మదిగా దానికి సోమరితనం వచ్చేస్తుంది. మనం

మెదడును ఉపయోగించుకొంటూ ఉంటే అది మనకు ఉపకారం చేస్తుంది. అంటే మెదడు దగ్గర నుండి మనకు గైడెన్స్ వస్తుంది. మన బుద్ధి బాగుండాలి. మన బుద్ధి పాడైపోతే మనకు ఎంత ఐశ్వర్యం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా ఏమీ ప్రయోజనం లేదు. అందుచేత మీ బుద్ధిని బాగుచేసుకోవాలి. మీ బుద్ధిని బాగుచేసుకోకుండా అది సాధించాను, ఇది సాధించాను అంటే దానివలన ప్రయోజనం లేదు. ఎక్కడైతే నిప్ప ఉందో అక్కడ పొగ ఉంటుంది. కాని ఆ నిప్పను పొగ మరుగుపరుస్తుంది. పొగ ఏవిధంగా అయితే నిప్పను కనబడకుండా చేస్తోందో అలాగే నీ హృదయంలో సత్యం ఉన్నప్పటికీ అది నీకు అవగాహన లోనికి రాకుండా నీ రూపబుద్ధి, నామబుద్ధి అడ్డువస్తున్నాయి. నీ హృదయంలో ఆనందం, శాంతి నీకు అందకుండా నువ్వే చేసుకొంటున్నావు. దానికి నీ రూపబుద్ధి, నామబుద్ధే కారణం. నువ్వు పరిమితులు కల్పించుకొంటున్నావు, విశాలం అవ్వలేకపోతున్నావు. మనకు రూపబుద్ధి, నామబుద్ధి బలీయంగా ఉంది. మన అస్థిత్వాన్ని ఆ రూపానికి, నామానికి పరిమితం చేసుకొంటున్నాము. అందుచేత దేహంపోయినప్పడు నేను పోతున్నాను అనుకొంటున్నాము. మీరందరూ గాఢనిద్రలో ఉన్నారు. అక్కడ శరీరం గొడవ, మనస్సు గొడవ, దేవుడు గొడవ, ప్రపంచం గొడవ లేకుండా మీరు గాఢనిద్రలో ఉన్నారు. జాగ్రదవస్థలో మనస్సు వచ్చాక ఈ గొడవ అంతా వస్తోంది. గాఢనిద్రలో మనస్సు అణిగిపోయినప్పడు మనస్సు కల్పించిన గొడవలు అన్నీ అణిగిపోతున్నాయి. చావుకూడా మనస్సే కల్పించింది కాబట్టి నీకు నిద్రలో చావు గొడవ లేదు. నిద్రలో నీకు ప్రపంచం గొడవ, దేవుడు గొడవ కూడా లేదు. అంటే మనస్సు కల్పించినవి అన్నీ మనస్సు అణిగిపోయినప్పడు అవి కూడా అణిగిపోతున్నాయి. అందుచేత అవి పారమార్థిక సత్యాలుకాదు. మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. ఈ మధ్య ఒక భార్య భర్త మాట్లాడుకుంటున్నారు. భార్య మాట్లాడుతూ ఏమంది అంటే వెళ్ళి ఎవరినో చూసివద్దాము అని చెపుతోంది. వారు మంచివారు కాదు అంటున్నాడు భర్త. వారు మంచివారు కాదు అని చెపుతున్నారు. అలాగే మనలను కూడా మంచివారు కాదు అని చాలామంది అనుకొంటున్నారు. అయితే మనం మంచివారము కాదా! అని అడిగింది. ఇదీ ప్రపంచం. ఇదే భగవాన్ చెప్పారు. వారు మంచివారు కాదు అని నువ్వు అంటున్నావు అంటే నువ్వు మంచివాడవు కాదు, నీలో అసలు మంచితనం లేదు. నీలో ఏదైతే లేదో అది బయట ఎక్కడ కనిపిస్తుంది. నీలో ఉన్నదే బయట కనిపిస్తుంది. నీలో చెడ్డతనం ఉంది కాబట్టే బయట చెడ్డతనం నీకు కనిపిస్తోంది. నీలో ఉన్నదే బయట కనిపిస్తుంది కాని నీలో లేనిది బయట కనబడదు. నీలో మంచితనం లేదు అనుకో బయట మంచితనం ఉన్నా అది నీకు కనబడదు, అందరూ చెడ్డవారికిందే నీకు కనిపిస్తారు. భారతంలో ఏమని చెప్పాడు అంటే

ధర్మరాజుకు ఈ సృష్టిలో ఒక్క చెడ్డవాడు కూడా కనబడలేదు, ధుర్యోధనుడికి ఒక్క మంచి వాడు కూడా కనబడలేదు. వ్యాసుడు లక్ష శ్లోకాలు వ్రాసి ఏమని చెప్పాడు అంటే ప్రపంచంలో లేనిది భారతంలో ఉంటుంది కాని ఈ భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు అని చెప్పాడు. ఈ లక్ష శ్లోకాల సారం ఏమిటి అంటే ఎదుటి మనిషి నీకేది చెయ్యకూడదని నువ్వు అనుకొంటున్నావో అదే పని నువ్వు ఎదుటివాడికి చెయ్యకు. మన బ్రెయిన్‌లో పెట్టుకొని మననం చేసుకోవటానికి రెండు ముక్కల్లో చెప్పాడు.

ఎవడు ఏ కారణం వలన దుఃఖంలో ఉన్నప్పటికీ ఆ దుఃఖంలో నుండి బయటకు తీసుకొనిరావటానికి మేగ్జిమమ్ ప్రయత్నం చేసేవాడు బుద్ధుడు. ఆయన కరుణ అపారం. వాడి కులం ఆయనకు అక్కరలేదు, వాడి మతం ఆయనకు అక్కరలేదు, ఒక మనిషి దుఃఖంలో ఉంటే అందులో నుండి వాడిని బయటకు తీసుకొనిరావటానికి చూసాడు. మీకు వెయ్యికోట్ల డబ్బు ఉన్నా మీరు దుఃఖంలేనిస్థితిని పొందలేరు, డబ్బుపెట్టి శాంతిని కొనుక్కోలేము. మీరు చేసేపని, మీరు మాట్లాడే మాట, మీకు వచ్చే ఆలోచన అన్నీ కూడా భగవంతుని అనుగ్రహం సంపాదించేటట్లుగా అవి ఉండాలి. అప్పుడు భగవంతుని దయ అనే వర్షం మీ శిరస్సుమీద కురుస్తుంది. అప్పుడు భగవదనుభవం పొందటానికి మీకు అర్హత కలుగుతుంది. కళ్ళు లేనివాడు ప్రపంచంలో ఉన్న ఏ వస్తువును చూడలేడు అలాగే రాగద్వేషములతో నిండి ఉన్న మనస్సు కలవాడు తనకు అత్యంత సమీపంలో తన హృదయంలో సత్యం ఉన్నప్పటికీ సత్యాన్ని సాక్షాత్కారం చేసుకోలేడు. కళ్ళులేనివాడు బయటకు చూడలేడు. రాగద్వేషములతో నిండి ఉన్న మనస్సు కలవాడు లోపలకు చూడలేడు. సాధన అంటే ఏమీ లేదు. మీరు మాట్లాడేమాట, మీరు చేసే పని మీ మనస్సు పరిశుద్ధం అవ్వటానికి సహకరించాలి. అప్పుడు మనస్సు పవిత్రం అవుతుంది. నామరూపాలు అంతా ఒక భ్రాంతి మాత్రమే. అనారోగ్యం పోయిన మరుక్షణంలో ఆరోగ్యం వచ్చేస్తుంది అలాగే మీకు నామరూపాలపట్ల ఉన్న భ్రాంతి, భ్రమ నశించినప్పుడు మీ హృదయంలో ఉన్న సత్యం దానంతట అదే మీకు ఎరుకలోనికి వస్తుంది. మీరు సత్యాన్ని తెలుసుకోవటంకాదు, సత్యమే మీకు తెలియబడుతుంది.

ఈ ప్రపంచం సత్యమా? అసత్యమా? అని అడిగితే భగవాన్ ఒక్క వాక్యంలో చెప్పారు. ఇది సత్యము అని చెప్పలేదు, అసత్యము అని చెప్పలేదు. సత్యమువలె కనిపిస్తోంది అన్నారు. అంటే అసత్యం అని అర్థం. ఆయన చమత్కారం చూడండి. జగత్తు సత్యమా? అసత్యమా? అనే గొడవ వదిలెయ్యి, నీ హృదయంలో ఒక నిజం ఉంది దాని గురించి అన్వేషించు. బైబిల్‌లో చెప్పాడుకదా వెదకండి దొరుకుతుంది, తట్టండి తెరువబడుతుంది అని చెప్పాడు. ఏకాగ్రతతో నీ హృదయంలో ఉన్న సత్యం గురించి అన్వేషిస్తే, అది నీ

హృదయంలో ఎంత లోయలలో ఉందో ఆ లోయలలోనికి నువ్వు దిగగలిగితే, అందులో ఉండగలిగితే అప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు తెలియబడుతుంది, అప్పుడు ఆటోమేటిక్‌గానే ఈ ప్రపంచం అసత్యం అని నీకు తెలుస్తుంది. రామానుజుడి మతస్థులు జగత్తు ఒక రత్నం, దేవుడు ఒక రత్నం, జీవుడు ఒక రత్నం మూడు రత్నాలు అని చెపుతారు. దీనికి భగవాన్ ఏమన్నారు అంటే అహంకారం ఉంటే మూడూ ఉన్నాయి, అది లేకపోతే మూడూ లేవు. నీకు వ్యక్తిభావన ఉన్నప్పుడు మూడు ఉన్నాయి, వాడు లేకపోతే మూడూ లేవు. ఉన్నది ఒక్కటే. అంటే ఒక ప్రక్కన రామానుజుడు చెప్పింది అంగీకరిస్తున్నాడు, మరల ఫైనల్ జడ్జిమెంట్ కూడా చెప్పేస్తున్నాడు. నువ్వు ప్రపంచానికి దగ్గరా ఉంటున్నావు, దేవునికి దూరంగా ఉంటున్నావు. నీకు జ్ఞానం కావాలంటే నువ్వు ప్రపంచధ్యాసను విడిచిపెట్టు. మీరు ఈ ప్రపంచం అంటే చాలా ఇష్టపడుతున్నారు. అందుచేత చనిపోయేటప్పుడు ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము అని చాలాబాధపడుతున్నారు. మీకు ఎవరిమీద అయినా ఎక్కువ ప్రీతి ఉంది అనుకోండి, వారు ఎక్కువకాలం కనబడకపోతే మీకు దుఃఖం వచ్చేస్తుంది. ఆ దుఃఖానికి కారణం ఎవరు అంటే మీకు వారి మీద ఉన్న ప్రీతే ఆ దుఃఖానికి కారణం. ప్రపంచం పట్ల అనురక్తి పెట్టుకోవద్దు. ప్రపంచంపట్ల విరక్తిగానే ఉండు. నువ్వు చేసుకొనేపని ఏదో చేసుకో. పనిపట్ల విరక్తివద్దు, ప్రపంచంపట్ల విరక్తిగానే ఉండు. లోకంపట్ల, నామరూపాల పట్ల నీకు అనురక్తి లేనప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నువ్వు గ్రహించగలిగే అంతస్థుకు చేరుకొంటావు. అటువంటి స్థితిని నువ్వు పొందాలి.

ప్రతీ జ్ఞాని కరుణామయుడే. మాటలు తేడా కాని సబ్జక్టు దగ్గరకు వచ్చేటప్పటికి జ్ఞానులు అందరూ సమానమే. నిన్ను నువ్వు ఎంత ప్రేమించుకొంటున్నావో, జ్ఞాని కూడా నిన్ను అంతగా ప్రేమిస్తూ ఉంటాడు. ఎందుచేతనంటే వాడికి భిన్నంగా నువ్వు కనబడవు. జ్ఞాని ఏ స్థితిలో అయితే ఉన్నాడో నిన్ను పిలక పట్టుకొని ఆ స్థితిలోనికి తీసుకొనిపోవటానికి ఆయన ప్రయత్నం చేస్తూ ఉంటాడు. జ్ఞాని నిన్ను ప్రేమిస్తున్నాడు అంటే, ఆయన పొందిన స్థితికి నిన్ను తీసుకొనిపోవటానికి ప్రయత్నం చేస్తున్నాడు అంటే దానికి భౌతికమైన కారణాలు ఏమీ కనబడవు. నీమీద ఉన్న అనుగ్రహం, దయవల్ల తప్పించి ఇంకో కారణం కనబడదు. భగవాన్ శరీరం విడిచిపెట్టేటప్పుడు అక్కడ ఉన్న భక్తులు ఏమన్నారు అంటే మీ శరీరం పడిపోతోంది, ఇంక ఈ అనుబంధం తెగిపోతోంది, ఇంక మమ్మల్ని ఎవరు అనుగ్రహిస్తారు అని అంటే భగవాన్ ఏమన్నారు అంటే ఈ శరీరానికి, అనుగ్రహానికి సంబంధం లేదు. ఈ శరీరం ఉన్నప్పుడు కూడా ఈ శరీరం మిమ్మల్ని అనుగ్రహించటంలేదు. ఏదైతే మిమ్మల్ని అనుగ్రహిస్తోందో దానికి మరణం లేదు. సత్యానుభవం మీకు కలిగేవరకు అది మిమ్మల్ని

విడిచిపెట్టదు. అనుగ్రహం ఏమి చేస్తుంది అంటే మీలో ఉన్న బలహీనతలను తొలగించి, సత్యాన్ని గ్రహించటానికి తగిన పవిత్రతను మీ మనస్సుకు యిచ్చి, జ్ఞాని ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితిని మీరు పొందేవరకు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. మధ్యలో మిమ్మల్ని విడిచిపెట్టే ప్రసక్తిలేదు. వాడు గురువు. మంచితనం ఎలా ఉంటుందో మీకు తెలియదు అనుకోండి ఎదుటివారిలో ఏదైనా మంచితనం ఉన్నా అది మీకు కనబడదు. ఆ మంచితనాన్ని కళ్ళు ఉన్నా మీరు చూడలేరు, చెవులు ఉన్నా దాని గురించి వినలేరు. మీలో ఉన్నదే బయట కనబడుతుంది కాని మీలో లేనిది బయట కనబడదు. మీలో ప్రేమ లేనప్పుడు, ఆప్యాయత లేనప్పుడు ఎదుటి మనిషిలో ఆప్యాయత ఉన్నా అది మీకు కనబడదు. మీకు లేదు కాబట్టి వారికి కూడా లేదు అనిపిస్తూ ఉంటుంది. అది మీరు అనుభవంలో కూడా చూడవచ్చు.

భగవాన్ చిన్ననాటి స్నేహితుడు నారాయణ అయ్యర్, ఆయన మధురై కాలేజీలో లెక్కల ప్రొఫెసర్. భగవాన్ ఆయన ఏడవతరగతి, ఎనిమిదవ తరగతి కలిసి చదువుకున్నారు. 1943-44లో ఒకసారి నారాయణ అయ్యర్ భగవాన్‌ను చూడటానికి వచ్చారు. ఆ సందర్భంలో ఆయన భగవాన్‌తో ఏమన్నారు అంటే "మనం చిన్నప్పుడు చెడుగుడు ఆడుకునేవాళ్ళం. నాదో పార్టీ, నీదో పార్టీ. ఎప్పుడూ మనం వేరే వేరే పార్టీలో ఉండేవాళ్ళము. ఎక్కువసార్లు నువ్వు ఉన్న పార్టీయే నెగ్గేది, నేను ఉన్న పార్టీ ఓడిపోయేది" అని నారాయణ అయ్యర్ భగవాన్‌తో అన్నారు. భగవాన్ ఏమన్నారు అంటే "మనం చిన్నప్పుడు ఆడుకున్న చెడుగుడు ఆటలు జ్ఞాపకం చేస్తున్నావు అప్పుడు నీకూ శరీరం ఉంది, నాకూ శరీరం ఉన్నమాట నిజమే. కాని ఇప్పుడు కూడా నీకు శరీరం ఉంది, నాకు ఇప్పుడు శరీరం లేదు. తిరువణ్ణామలై వచ్చేటప్పటికే నేను శరీరం లేనివాడిని అయిపోయాను. శరీరం లేని నాకు శరీరం ఉన్నప్పుడు మాటలు జ్ఞాపకం చేస్తావెందుకు? ఆ మాటలు ఇప్పుడు నా దగ్గర చెప్పవద్దు, ఆ మాటలు ఇప్పుడు చెప్పటం వలన ప్రయోజనం ఏమిటి? ఆ గొడవలు వదిలెయ్యి" అన్నారు భగవాన్.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1995)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం శారీరకంగా, మానసికంగా బలహీనపడటానికి భయం కారణం. అందుచేత భయాన్ని విడిచిపెట్టు. భగవంతుడిమీద భారం వేయటం నేర్చుకొంటే భయం తగ్గుతూ ఉంటుంది. ఈశ్వరప్రీతి కోసం పని చెయ్యి. నీకు ఆశ కలిగించే పనులు విడిచిపెట్టు. సకామకర్మలను విడిచిపెట్టు. నిష్కామకర్మ వలన చిత్తశుద్ధి కలుగుతుంది. కామ్యకర్మల వలన రాబోయజన్మలకు సంబంధించిన హేతువులు పెరిగిపోతాయి. మరల వాటిని

తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. రోగం వచ్చిన తరువాత దానిని తగ్గించుకోవటం కాదు రోగం రాకుండా చూసుకోవటం మంచిది. సకామకర్మ చేసి బంధంలో పడటంకంటే నిష్కామకర్మ చేయటం వలన అసలు బంధంలో పడవు. మంచి గ్రంథాలు చదవటం, దానిని మననం చేసుకోవటం, దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పటం దీనిని బ్రహ్మయజ్ఞం అంటారు. మనుషులకు చేతనైనంతవరకు సహాయం చేయటం దీనిని నరయజ్ఞం అంటారు. ఇవి రెండూ మనకు రెండు కళ్ళు వంటివి. వీటిని ఆచరించటం వలన చిత్తశుద్ధి కలుగుతుంది. నీ పనులు శ్రద్ధగా చేసుకో. నాకోసం సామాన్యధర్మాలను విడిచిపెట్టినా నీకు దోషం లేదు. నన్నే గతిగా నమ్మి, నన్ను పొందటంకోసం నీవు సామాన్య ధర్మములను విడిచిపెట్టినా, నీలో ఎన్ని లోపములు ఉన్నా వాటినుండి నిన్ను విడుదల చేసి నీకు మోక్షాన్ని ఇచ్చే బాధ్యత నాది అని పరమాత్మ చెపుతున్నాడు.

నీ దేహప్రారబ్ధాన్ని బట్టి పరిస్థితులు ఒకోసారి అనుకూలంగా ఉండవచ్చు, అప్పుడు గర్వపడవద్దు. ఒకోసారి పరిస్థితులు వ్యతిరేఖంగా ఉండవచ్చు, అప్పుడు కృంగిపోవద్దు. మనస్సును సమానంగా ఉంచుకో. అప్పుడు భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుతావు. వచ్చే పరిస్థితులను ద్వేషించవద్దు. పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకంగా ఉన్నా అవి కలకాలం నిలబడవు. దేహమే కలకాలం నిలబడదు ఇంక పరిస్థితులు కలకాలం ఎలా నిలబడతాయి. ఏదైనా కాలప్రవాహంలో కొట్టుకొనిపోతుంది. ఇప్పుడు మనం కొంతమంది అంటే ప్రీతిగా ఉంటాము, కొంతమంది అంటే అప్రీతిగా ఉంటాము. ఇవి రెండూ మోక్షమును పొందటానికి నీకు అడ్డు వస్తున్నాయి. అది నీకు తెలియటంలేదు. ఇవి బయట ఉంటే తోలేసుకొందుము కాని ఇవి నీ లోపల ఉన్నాయి, మనోరూపంలో ఉన్నాయి. వీటిని తగ్గించుకోవటానికి సాధన చెయ్యాలి. ఇవి కనుక పోతే మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది.

ప్రారబ్ధమును అనుభవించటానికి మనం ఈ లోకంలోనికి వచ్చాము. ప్రారబ్ధాన్నిబట్టి మనకు ఏదో ఒక పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది. వాటివలన మనస్సులో వికారాలు రాకుండా చూసుకో. మనస్సును సమానంగా ఉంచుకో, ఒక భక్తుడు భగవంతుడితో ఏమన్నాడు అంటే "నా ప్రారబ్ధంలో ఉన్నదే పంపిస్తున్నావు. ప్రారబ్ధంలో నాకు కష్టాలు ఉన్నాయేమో నీవు మాత్రం ఏమి చేయగలవు, అక్కడ ఉన్నదే పంపిస్తున్నావు. నీవు కష్టాలు పంపుతున్నావని నీమీద ప్రేమను విడిచిపెట్టను. ప్రాణం పోయేసమయంలో కూడా నీమీద ప్రేమను విడిచిపెట్టను. నిన్ను ప్రేమిస్తూనే ప్రాణం విడిచిపెడతాను" అని చెప్పాడు. కొంతమంది

వారికి కష్టాలు వస్తే భగవంతుడిని వదిలేస్తారు. "ప్రారబ్ధంలో ఉంటే మనం కోరుకోకపోయినా అది వస్తుంది. ప్రారబ్ధంలో లేనిది నీవు కోరుకున్నా అది రాదు. రానిదానిని నీవు కోరుకొంటే అది ఎలాగు రాదు సరికదా నీ మనస్సుకు అశుచి వస్తుంది. శుభమును, అశుభమును విడిచిపెట్టు. పుణ్యంకోసం పనులు చేయవద్దు. పుణ్యంకోసం పనులు చేస్తే పాపం ఎదురవుతుంది. శుభమును ఆశిస్తే అశుభం కూడా వస్తుంది. చాలామంది పుణ్యం వస్తుంది అంటేనే పనులు చేస్తారు. అందులో నీవు చేరవద్దు. శుభమును, అశుభమును విడిచిపెడితే నీవు నాకు ప్రియుడవు అవుతావు" అని పరమాత్మ చెపుతున్నాడు. పనిచెయ్యి కాని ఆసక్తి పెట్టుకోవద్దు. భగవంతుడు చెప్పాడు కాబట్టి పనిచేసి వదిలివేయటమే, వెంటనే దానిని మర్చిపోవాలి. భగవంతుడు మన మీద దయ చూపించి గతజన్మలు అన్నీ మనకు మరుపు పెట్టాడుకాని అవి జ్ఞాపకం వస్తూ ఉంటే ఒక్కక్షణం కూడా గడవదు, జీవితానికి మరపు అవసరం. భగవంతుడు ఒక్కడినే మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. మిగిలిన విషయాలు అన్నీ మర్చిపోవాలి.

మనం తాత్కాలిక ప్రయోజనాల కోసం భగవంతుడిని ప్రార్థిస్తాము. నాకు నీ స్వరూపమే కావాలి, ఇంకేమీ నాకు అక్కరలేదు అని భగవంతుడిని ప్రార్థించము. దానికి కారణం మనకు వైరాగ్యం లేదు. వైరాగ్యం ఉన్నవాడు నాకు భగవంతుడే కావాలి అంటాడు. వైరాగ్యం లేనివాడు వాడికి భక్తి ఉన్నా భగవంతుడే కావాలి అని కోరుకోడు, లోకానికి సంబంధించినవి కోరుకొంటాడు. ఇప్పడు సమాజంలో మనిషికి మనిషికి ఉన్న సంబంధం వస్తు సంబంధమే. దీనిలో అనురాగం లేదు, ఆప్యాయత లేదు. ఈ సంబంధం వస్తువుల మీద ఆధారపడి ఉందికాని ప్రేమమీద ఆధారపడిలేదు, మానవత్వం మీద ఆధారపడిలేదు. ఇప్పడు నేను చెపుతున్నాను, మీరు వింటున్నారు. దీని వలన పరమేశ్వరుని పాదాలను ఆశ్రయించాలనే బుద్ధి మీకు కలిగినప్పటికి ఈ నాలుగు గోడలు విడిచి బయటకు వెళ్ళిన తరువాత మీకు భక్తి మిగులుతుంది కాని పరమాత్మను పొందాలనే లక్ష్యం ఉండటంలేదు. ఎందుచేతనంటే సంసారంలో ఏవో కష్టాలు వస్తూ ఉంటాయి. వాటినుండి విడుదల చేయమని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము కాని నీవే కావాలి అని భగవంతుడిని ప్రార్థించటం లేదు. మనలో వైరాగ్యం లేకపోవటం వలన శాశ్వతమైన వస్తువును పొందటంకోసం ప్రార్థించే శక్తి మనకు రావటంలేదు. భక్తిలో మనం పిల్లలము. శారీరకంగా ముసలివారము అయ్యాము కాని మానసికంగా మనం ఎదగలేదు. చిన్నపిల్లవాడిదగ్గర ఆటవస్తువులు, బంగారం పెడితే ఆటవస్తువులే తీసుకొంటాడు ఎందుచేతనంటే బంగారం విలువ వాడికి తెలియదు. మన పరిస్థితి కూడా అలాగే ఉంది. శాశ్వతమైన వస్తువును వదిలేసి ఇవాళ ఉండి రేపు ఊడిపోయే

వస్తువులను కోరుకొంటున్నాము. గురువు అనుగ్రహం వలన శాశ్వతమైన వస్తువును కోరుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది.

కాసిన చెట్టునే రాళ్ళతో కొడతారు. కాయని చెట్టును ఎవరూ కొట్టరు. అలాగే నీవు మంచిగా జీవిస్తున్నప్పటికీ ఒకోసారి నీకు కష్టాలే ఎదురవుతాయి, నిన్ను తిడుతూ ఉంటారు. అంటే నువ్వు ఎంతవరకు సమానంగా ఉంటున్నావో చూడటానికే భగవంతుడు ఇటువంటి పరీక్షలు పెడతాడు. నీకు ఆధ్యాత్మిక బలం పెంచటానికే భగవంతుడు ఇది అంతా చేస్తున్నాడు. దీనిని అర్థం చేసుకొని నువ్వు నిదానంగా ఉండాలి. గౌరవం వచ్చినప్పుడు, అగౌరవం వచ్చినప్పుడు నీ మనస్సు ఎలా ఉంటోందో చూసుకో. వాటివలన నీ మనస్సులో వికారం రాకూడదు. అప్పుడు కూడా నీ మనస్సు సమానంగా ఉంటే నువ్వు యోగానికి అర్హుడవుతావు. పని చెయ్యి, ఆసక్తి పెట్టుకోవద్దు. పని నిన్ను బంధించదు, ఆసక్తి నిన్ను బంధిస్తుంది. ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నన్ను తెలుసుకొనే ప్రయత్నంలో నీకు ఎటువంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ నాకోసం వాటిని భరించు. నన్ను తెలుసుకొనే ప్రయత్నంలో ఉన్నావు కాబట్టి ఆ కష్టాలను భరించటం నేర్చుకో. కొంతమంది ఎక్కువగా విమర్శిస్తూ ఉంటారు. మీలోని లోపములను విమర్శిస్తున్నారు అనుకోండి ఆ లోపములను సవరించుకోండి. మీలో లేనివి విమర్శిస్తున్నారు అనుకోండి ఆ విమర్శలను పట్టించుకోవద్దు. అప్పుడు ధైర్యంగా ఉండండి. ఎక్కడో ఒకేచోట స్థిరంగా ఉండాలని అనుకోనక్కరలేదు. ప్రారబ్ధమును బట్టి ఎక్కడ ఉండాలో అక్కడ ఉంటాము. ఒకేచోట ఉండాలి అనుకొంటే సంఘదోషం వస్తుంది. లోకం గొడవలలోనికి వెళ్ళవద్దు. నీ మనస్సును ఆత్మమీద స్థిరంగా ఉంచుకో. ఆత్మచింతన తప్ప మిగిలిన చింతలు వద్దు. అనాత్మ గొడవలన్నింటిని అగ్నికి ఆహుతి చెయ్యి. నెయ్యిని, కొబ్బరిచిప్పలను, కట్టెలను అగ్నికి ఆహుతి చెయ్యటంకాదు. నీ గుణాలను పూర్ణంగా అగ్నికి ఆహుతి చెయ్యి. ఎదుటివారు మంచివారా, చెడ్డవారా అనే గొడవలు వద్దు. అందరినీ సమానంగా ప్రేమిద్దాము. వారికోసం కాదు, మనం బాగుపడటం కోసం అందరినీ సమానంగా ప్రేమించాలి. పరమాత్మ ఏమంటున్నాడు అంటే "నీవు పొందవలసింది నన్నే. అందుచేత నన్నే గమ్యంగా పెట్టుకో. నాయందే ఆసక్తి పెట్టుకో. లోకం మీద ఆసక్తి వద్దు. నన్ను పొందే ప్రయాణంలో నీకు ఇష్టమైన వారి మాటలు వినబడినా నువ్వు వెనకకు చూడవద్దు. భౌతికంగా నీకు ప్రీతిపాత్రులు అడ్డువచ్చినా వారిని గెంటివేసి ప్రయాణం సాగించు. అప్పుడు నా స్వరూపాన్ని నీకు ఇస్తాను" అంటున్నాడు పరమాత్మ. ఇవి మాటలు కాదు, ఇది అమృతం.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# వ్యాస పూర్ణిమ

వేదరాశిని నాలుగు భాగములుగా విభజించి, గురురూపమై వెలుగొందిన వేదవ్యాసుని జన్మదినమైన ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురుపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అనేక జన్మలు పుణ్యఫలితంగా మనకు సద్గురువు లభిస్తాడు. జీవుడు తరించడానికి గురువు యొక్క ఆవశ్యకతను మరియు గురుపరంపరను గౌరవించవలసిన ఆవశ్యకతను గుర్తుచేసే రోజు గురుపూర్ణిమ. వ్యాసాయ విష్ణురూపాయ అంటారు, అనగా శ్రీ మహావిష్ణువే వ్యాసుడి రూపంలో అవతరించాడని అంటారు. వ్యాసుడు బ్రహ్మసూత్రములను, మహాభారతాన్ని, అష్టాదశ పురాణాలను రచించి మానవాళికి మహత్తరమైన మేలు చేసాడు. మనలో ఉన్న అజ్ఞానమనే చీకటిని పారద్రోలి, అసత్యమునుండి సత్యములోనికి, అజ్ఞానము నుండి జ్ఞానములోనికి, మృత్యువు నుండి అమృతత్త్వములోనికి, మనను మేల్కొలుపుటకు గురువు తగిన సహాయ, సహకారలనందిస్తారు. జనన మరణ సంసార చక్రం అనే మహావ్యాధి నుండి విడుదల పొందే యోగ్యత మనకు కలిగినప్పడు మనమీద దయతో పరమాత్మే సద్గురు రూపంలో మనకు తెలియబడి మనను సత్యం వైపుకు నడిపిస్తాడు. దేహాత్మ బుద్ధినుండి విడుదలపొంది, బ్రహ్మాత్మబుద్ధిలో స్థిరపడుటకు మనకు తత్త్వబోధ చేసి హృదయంలో అంతర్యామిగా స్వరూపంగా ఉన్న సత్యంతో అనుసంధానం కలుగజేస్తాడు గురువు. జీవుడు వాస్తవంగా తానెవరో? తెలిసికొని బ్రహ్మానుభూతిని పొందటానికి స్వప్రయత్నం, గురువుయొక్క అనుగ్రహం రెండూ అవసరమే! తానెవరో? అనుభవైకవేద్యం అయ్యేవరకు దుఃఖం విడిచిపెట్టదు, స్వరూపశాంతి అందదు. గురువు యొక్క సమక్షం, బోధ, చూపు, స్పర్శ, మౌనం, ఇవన్నీ శిష్యుని యొక్క చైతన్య స్థాయిని పెంచుతాయి. గురుపూర్ణిమ రోజున తమతమ గురువులను ఆరాధించి, గురుబోధను ఆచరించి, స్వరూప అమృతస్థితిలోకి మేల్కొనుటద్వారానే గురు ఋణము తీర్చుకోగలము.

**(ది॥ 12-07-2014 గురుపూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# కృష్ణస్తు భగవాన్ స్వయం - 1

ఉండునది ఒక్కటే. దాన్ని ప్రాజ్ఞులు అనేక నామాలతో పిలుస్తారు. శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం ఏర్పడిన ఉపాధి. మహాభారత యుద్ధానికి సూత్రధారి, సంధి ప్రయత్నం సఫలంకాక యుద్ధం చేయించాడు. మహాసంగ్రామం మధ్య అర్జునుని నెపంగా పెట్టుకొని లోకానికి తత్వబోధను భగవంతుడై చెప్పిన గీత. ఆయన అంటారు "నేను శరీరం ధరించకపోతే భగవంతుడు లేడు అనుకొంటారు. శరీరం ధరిస్తే అవమానిస్తారు. నేను ఒక్క కర్మను ఒక్క క్షణం చేయకపోతే ఊరక ఉంటే ఈ సర్వజగత్తు నాశనమైపోవును" అన్నారు. అంటే ఆయన శక్తి ఈ లోకంలో నిద్రపోవుచున్నది అనుట అసందర్భము. ఆ సృజన శక్తి పనిచేస్తున్నది విశ్రాంతిలేదు అని అర్థం. ఆయనది లీలావతారం. గీతలో 'నేను' అని ఆయన ఉదహరించినది ఆత్మనే సూచిస్తుంది. "నన్నే శరణుపొందు అంటే ఆత్మలోనే సంస్థితుడై ఉండని అర్థం. భక్తిరూపమగు ఉపాసన సర్వత్ర శ్రేష్టము. ఈ భక్తిని జ్ఞానముకన్న సత్యాన్ని సులభంగా పొందవచ్చు. జ్ఞానమార్గమునకు అనుకూల పరిస్థితులు, తీవ్రసాధన అవసరం. భగవంతుని ఎడల గాఢమైన ప్రేమ, భక్తి కావాలి. ఆ భక్తి యొక్క గొప్పసుగుణం వల్ల మనస్సు నిర్మలము, పవిత్రము చేస్తుంది. దేశకాల విచక్షణ లేక నిరంతరం భగవంతుని లేదా సద్గురువుని స్మరిస్తూ ఉండాలి. శ్రీ నాన్నగారు "మనస్సుకు రూపం అంటే ఇష్టం. మీ ఇష్టదైవాన్ని నిరంతరం స్మరించటం వల్ల సత్యదర్శనమవుతుంది. సాధనలో ఇది తేలిక మార్గం" అన్నారు. అన్నమయ "నామ జపం వెల బహు సులభం - ఫలమధికం" అన్నారు. గోపికలకు శ్రీకృష్ణుడు జగన్నాధుడు, సర్వశక్తివంతుడు, పరంధాముడు అని వినుటయందు వారికి ఆశక్తిలేదు. ఆయన అఖండ ప్రేమమూర్తి అని మాత్రమే అని పరిగణించారు. ఆయన గోపాలుడే అని వారి భావన. గోపికల ఆర్తి "మాకు ధనమక్కరలేదు, జనమక్కరలేదు, పాండిత్యమక్కరలేదు, స్వర్గప్రాప్తి అక్కరలేదు ఎన్ని జన్మలు మాకు కలుగుగాక దేవా! నీ ఎడల భక్తి ఉండునట్లు అది నిష్కామ భక్తి ఉండునట్లు అనుగ్రహించుము" అని ప్రార్థించారు. భక్తి భక్తి కొరకే, కర్మ కర్మ కొరకే, ధర్మము ధర్మము కొరకే అను ఈ భావము శ్రీకృష్ణావతారంలో ఉత్తమోత్తమముగా ఆయన ముఖం నుండి ప్రప్రదమముగా వెలువడినది. రాధాకృష్ణులు "భగవంతుణ్ణి ఏవిధంగా ఆరాధించినా సరే పరితాపము ఒక్కటే ఆయన దర్శనానికి అవశ్యకం" అన్నారు. భగవాన్ రమణులు "బ్రహ్మానుభూతికి 'ఆర్తి' మార్గం" అన్నారు. భక్తకన్నప్ప దీనికి ఉదాహరణ. శ్రీకృష్ణుడు షోడశ కళలతో ఉద్భవించిన అవతార మూర్తి. బాగుపడేవారంతా భాగవతం చదువుతారు. మన స్వరూపం పొందటానికి అది చాలు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**